మొదటి యూనిట్

# 3. మేలిమి ముత్యాలు



- వివిధ కవులు

**ఆలోచించండి - మాట్లాడండి.**




ప్రశ్నలు :

1. చిత్రాన్ని చూడండి. చిత్రంలో ఎవరెవరున్నారు? ఏం చేస్తున్నారు?
2. చిత్రంలో మాట్లాడుతున్నది ఎవరు? ఆయన ఏం చెప్తున్నారు? దాని భావం ఏమిటి?
3. ఇలాంటి పద్యాలు మీకు తెలిసినవి చెప్పండి. మరికొన్ని పద్యాలను పాఠం చదివి తెలుసుకోండి.

**విద్యార్థులకు సూచనలు :**

1. పాఠాన్ని చదవండి. అర్థంకాని పదాలకింద, వాక్యాల కింద గీతలు గీయండి.
2. అర్థంకాని పదాలను, వాక్యాలను గురించి మీ మిత్రులతో చర్చించండి.
3. పాఠ్యపుస్తకం చివరన ఉన్న పదాలు-అర్థాలు పట్టిక చూసి తెలియని పదాల అర్థాలను తెలుసుకోండి.



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ



★ క. కలిమిగల లోభికన్నను
విలసితముగ పేద మేలు వితరణి యైనన్
చలిచెలమ మేలు కాదా
కులనిధి యంభోధికన్న గువ్వలచెన్నా. 1

– గువ్వల చెన్న శతకం

★ క. అవయవహీనుని, సౌంద
ర్యవిహీను, దరిద్రు, విద్యరానియతని, సం
స్తవనీయు, దేవు, శ్రుతులన్
భువి నిందింపఁ దగదండ్రు బుధులు కుమారా। 2

– కుమార శతకం

★ ఆ. పుస్తకముల నీవు పూవువోలెను చూడు
చింపఁబోకు మురికి చేయఁబోకు
పరుల పుస్తకముల నెరువు తెచ్చితి వేని
తిరిగి యిమ్ము వేగ, తెలుఁగు బిడ్డ। 3

– తెలుగుపూలు శతకం

★ తే. సానఁబెట్టిన వజ్రంబు లీను కాంతి
పొలము చక్కగ దున్నిన ఫలమునిచ్చు
నటులె యజ్ఞానియైనను నవనిపైని
విద్య నేర్చినయేని వివేకియగును. 4

– అజ్ఞాత కవి

★ ఆ. పుత్తడిగలవాని పుండుబాధైనను
వసుధలోన చాల వార్తకెక్కు
పేదవాని యింట పెండ్లైన యెరుగరు
విశ్వదాభిరామ వినురవేమ. 5

–వేమన పద్యం

★ ఉ. ఆపదలందు ధైర్యగుణ, మంచిత సంపదలందుఁ దాల్మియున్,
భూపసభాంతరాళమునఁ బుష్కలవాక్చతురత్వ, మాజి బా
హాపటుశక్తియున్, యశమునం దనురక్తియు, విద్యయందు వాం
ఛాపరివృద్ధియున్, బ్రకృతి సిద్ధగుణంబులు సజ్జనాళికిన్ 6

– సుభాషిత రత్నావళి

★ ఆ. పత్రికొకటియున్న పదివేలసైన్యము
పత్రికొక్కటున్న మిత్రకోటి
ప్రజకు రక్షలేదు పత్రికలేకున్న
వాస్తవమ్ము నార్లవారి మాట 7

– నార్లవారి మాట

★ తే. మొదలఁ జూచినఁ గడు గొప్ప పిదపఁ గుఱుచ
యాది గొంచెము తర్వాత నధికమగుచుఁ
దనరు, దినపూర్వ, పరభాగజనితమైన
ఛాయపోలికఁ గుజనసజ్జనుల మైత్రి. 8

– సుభాషిత రత్నావళి

★ తే. సత్యసూక్తి ఘటించు ధీజడిమ మాన్పు
గౌరవమొసంగు జనులకు గలుషమడఁచు
గీర్తిఁ బ్రకటించు చిత్తవిస్ఫూర్తిఁ జేయు
సాధుసంగంబు సకలార్థ సాధకంబు. 9

– సుభాషిత రత్నావళి

★ సీ. తల్లిగర్భమునుండి ధనము తేడెవ్వఁడు,
వెళ్ళిపోయెడినాడు వెంట రాదు
లక్షాధికారైన లవణమన్నమె కాని
మెఱుగు బంగారంబు మ్రింగఁ బోడు
విత్తమార్జన చేసి విఱ్ఱవీగుటె కాని,
కూడఁ బెట్టిన సొమ్ముఁ గుడువఁ బోడు
పొందుగా మఱుగైన భూమిలోపల పెట్టి
దానధర్మము లేక దాచి దాచి

★ తే. తుదకు దొంగలకిత్తురో? దొరలకవునొ?
తేనె జుంటీగ లియ్యవా తెరువరులకు?
భూషణ వికాస! శ్రీ ధర్మపుర నివాస!
దుష్టసంహార! నరసింహ! దురిత దూర! 10

– నరసింహ శతకం



### కవి పరిచయాలు

| కవి | కాలం | రచన |
|---|---|---|
| 1. పట్టాభిరామకవి/ గువ్వల చెన్నడు | 16వ శతాబ్ది | గువ్వల చెన్న శతకం |
| 2. పక్కి అప్పలనర్సయ్య | 16వ శతాబ్ది | కుమార శతకం |
| 3. నార్ల చిరంజీవి | 20వ శతాబ్ది | తెలుగుపూలు శతకం |
| 4. అజ్ఞాత కవి | -- | -- |
| 5. వేమన | 17వ శతాబ్ది | వేమన పద్యాలు |
| 6. నార్ల వెంకటేశ్వరరావు | 20వ శతాబ్ది | నార్లవారి మాటల |
| 7. ఏనుగు లక్ష్మణకవి | 17వ శతాబ్ది | సుభాషిత రత్నావళి |
| 8. శేషప్పకవి | 18వ శతాబ్ది | నరసింహ శతకం |

© SCERT not to be republished

## పద్యాలకు భావాలు

1. ధనికుడైన పిసినారి కంటే దానగుణమున్న పేదవాడే మేలు. అనంత జలరాశి గల సముద్రుడికంటే మంచినీరున్న గొయ్యి మేలు కదా!

2. కుమారా! భూమిపైన అవయవలోపం ఉన్నవాళ్ళనూ, అందంగా లేనివాళ్ళనూ, పేదవాళ్ళనూ, నిరక్షరాస్యుణ్ణీ గొప్పవాళ్ళనూ దైవాన్నీ వేదాలనూ నిందించగూడదని పెద్దలు చెబుతారు.

3. ఓ తెలుగు బిడ్డా! పుస్తకాలను పువ్వుల్లా చూడు. చింపవద్దు. మురికి చేయవద్దు. ఇతరుల పుస్తకాలు అడిగి తెచ్చుకొంటే వాటిని త్వరగా తిరిగి ఇచ్చివేయాలి.

4. సానబెడితేనే వజ్రం కాంతిని వెదజల్లుతుంది. చక్కగా దున్నితేనే పొలం పంటనిస్తుంది. అలాగే భూమిమీద ఎంత అజ్ఞాని అయినా సరే చదువుకుంటేనే వివేకి అవుతాడు.

5. ఓ వేమా! భూమిమీద ధనవంతుడు చిన్న కురుపుతో బాధ పడినాకూడా పెద్దగా ప్రచారమవుతుంది. కాని పేదవాడి ఇంట్లో పెళ్ళి జరిగినా కూడా ఎవరికీ తెలియదు.

6. ఆపదలు వచ్చినప్పుడు ధైర్యం, ఐశ్వర్యం వచ్చినప్పుడు ఓర్పు, సభల్లో వాక్పాటవం, యుద్ధంలో శౌర్యం చూపడం, కీర్తియందు ఆసక్తి, విద్య నేర్చుకోవాలనే కోరిక – ఇవి మహాత్ములకు సహజ గుణాలు.

7. ఒక పత్రిక పదివేల సైన్యంతో సమానం; కోటిమంది మిత్రులతో సమానం. పత్రిక లేకపోతే ప్రజలకు రక్షణ ఉండదు. సమాజంలోని మంచి చెడులను భయంలేకుండా పత్రికలు తెలియజేస్తాయి. అందువల్ల సమాజంలో పత్రికలు ఉండాలి.

8. చెడ్డవాళ్ళస్నేహం, ఉదయంపూట నీడలాగ మొదట ఎక్కువగా ఉండి క్రమక్రమంగా తగ్గిపోతుంది. మంచివాళ్ళతో స్నేహం, సాయంకాలపు నీడ లాగ మొదట చిన్నదిగా ఉండి క్రమక్రమంగా పెరుగుతూ వస్తుంది. బుద్ధిమంతుడు ఏది మంచిదో తెలుసుకోవాలి.

9. మంచివాళ్ళతో సహవాసం మందకొడితనాన్ని పోగొడుతుంది. సత్యాన్ని మాట్లాడేలా చేస్తుంది. మంచి గౌరవాన్ని ఇస్తుంది. పాపాలను పోగొడుతుంది. మనస్సును బాగుచేస్తుంది. కీర్తిని వ్యాపింపజేస్తుంది. ఇన్ని మాటలెందుకు? లోకంలో అది చేయలేని మంచిపని అంటూ లేదు.


10. శ్రీ ధర్మపుర నివాసుడా! ఆభరణాలచేత ప్రకాశించేవాడా! పాపాలను దూరంచేసేవాడా! దుర్మార్గులను పారదోలే వాడా! ఓ నరసింహా! తల్లికడుపులో నుంచి పుట్టినప్పుడు ఎవ్వడూ ధనాన్ని వెంట తీసుకొనిరాడు. పోయేటప్పుడు వెంట తీసుకొని వెళ్ళలేదు. లక్షాధికారైనా ఉప్పుతో కూడిన ఆహారాన్నే కాని బంగారాన్ని తినలేడు. డబ్బు సంపాదించి గర్వం పెంచుకోడమే. కానీ తాను కూడబెట్టిన సొమ్మును తినడు. అలాంటిదాన్ని దానం, ధర్మం చేయకుండా భూమిలో పాతిపెడుతూ ఉంటాడు. చివరకు దాన్ని అనుభవించకుండానే, తేనెటీగలు తేనెను బాటసారులకు సమర్పించుకొన్నట్టు దొంగలకో, రాజులకో సమర్పించుకొంటాడు.



# ఇవి చేయండి



## I. వినడం-మాట్లాడడం



1. పాఠంలోని పద్యాలను కంఠస్థం చేయండి. రాగంతో పాడండి. అలాగే భావం అర్థమయేలా చదవండి.
2. మీ తరగతిలో ఇద్దరు జతగా కూర్చోండి. ఒకరు పద్యం చదివితే ఇంకొకరు భావం చెప్పండి.
3. పాఠంలోని ఏ పద్యం మీకు నచ్చింది? ఎందుకు?
4. మీకు తెలిసిన కొన్ని సూక్తులూ, నీతివాక్యాలూ చెప్పండి.
5. ఈ పాఠానికి మేలిమి ముత్యాలు అనే పేరు తగిన విధంగా ఉందా? ఎందువల్ల?

## II. చదవడం - రాయడం





**1. పాఠంలోని పద్యాలలో ఏ ఏ పద్యాలలో ప్రాసపదాలు ఎక్కువగా ఉన్నాయి? ఆ పదాలు ఏవి? పద్యాలలో వాటిని గుర్తించండి.**

**2. పాఠం ఆధారంగా కింది విషయాలకు తగిన పద్యాలను చదవండి. పద్యభావాన్ని సొంతమాటల్లో చెప్పండి.**

అ. "కష్టపడితే ఫలితం ఉంటుంది"

ఆ. ఎవర్నీ చిన్నచూపు చూడగూడదు.

ఇ. మంచివాళ్ళతో సావాసం మేలు చేస్తుంది.

**3. పాఠంలోని పద్యాలు ఆధారంగా కింద తెలిపినవాటిని దేనితో పోల్చారో చెప్పండి.**

అ. ధనికుడైన పిసినారి

ఆ. పేదవాడు

ఇ. చెడ్డవాళ్ళ స్నేహం

ఈ. మంచివాళ్ళ స్నేహం

ఉ. డబ్బు సంపాదించి కూడబెట్టడం

ఊ. కోటిమంది మిత్రులు

**4. పాఠం ఆధారంగా కింది ప్రశ్నలకు జవాబులు రాయండి.**

అ. ఎవరెవరిని చులకనగా చూడగూడదు?

ఆ. పుస్తకాలను మనం ఎలా జాగ్రత్తగా ఉంచుకోవాలి?

ఇ. చదువుకొంటే ఎవరైనా ఎలా మారతారు?

ఈ. ధనవంతులు, పేదవారి ఇండ్లలో ఏమి జరిగినా ఎవరిని గురించి తొందరగా బయటవాళ్ళకు తెలుస్తుంది?

ఉ. మంచివారి సహజ గుణాలేవి?

ఊ. బుద్ధిమంతుడు ఏమి తెలుసుకొని వ్యవహరించాలి?

ఎ. మంచితనానికి ఉండే గొప్పతనం ఏమిటి?

© SCERT not to be republished



ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారిచే ఉచిత పంపిణీ

## 5. పాఠంలోని పద్యాలు ఆధారంగా చేసుకొని తప్పొప్పులు గుర్తించండి.

అ. ఎవరిదగ్గర నుంచి అయినా పుస్తకాలు తెచ్చుకుంటే వాళ్ళు అడిగిన వెంటనే ఇవ్వాలి. ( )

ఆ. కష్టపడ్డ తరవాత పొందే సుఖం ఎంతో గొప్పగా ఉంటుంది. ( )

ఇ. పత్రికలు లేకుంటే ప్రజలకు రక్షణ లేదు. ( )

ఈ. ధనవంతుడి విషయాలు తొందరగా ప్రచారం కావు. ( )

ఉ. మంచివాళ్ళతో స్నేహం చేస్తే, వాళ్ళ కీర్తి కూడా వ్యాప్తి చెందుతుంది. ( )

ఊ. ఎవరైనా అన్నం తింటారేకాని బంగారం తినరు. ( )

ఎ. సంపాదించిన సొమ్మును అనుభవించకుండా దాచిపెట్టాలి. ( )

# III. స్వీయరచన



## 1. కింది ప్రశ్నలకు నాలుగైదు వాక్యాలలో జవాబులు రాయండి.

అ. ధనికుడైన పిసినారిని సముద్రంతో, దానగుణమున్న పేదవాడిని మంచినీటి మడుగుతోనూ పోల్చడాన్ని గురించి మీ అభిప్రాయం తెలపండి.

ఆ. సాధారణంగా గొప్పవాళ్ళనూ, దైవాన్నీ ఎవరూ నిందించరు. అవయవలోపం ఉన్నవాళ్ళనూ, అందంగా లేనివాళ్ళనూ కూడా చులకనగా చూడగూడదని తెలుసుకొన్నారు కదా! కాబట్టి వాళ్ళను కూడా అందరితో సమానంగా చూడటానికి ఏం చేయాలి?

ఇ. ఇతరుల పుస్తకాలను అడిగి తెచ్చుకుంటే వెంటనే తిరిగిఇవ్వాలని తెలుసుకున్నారుకదా! ఇలా ఎందుకు చెయ్యాలి?

ఈ. ఎంతటి అజ్ఞాని అయినా చదువుకొంటే వివేకి అవుతాడని మీరు ఎలా చెప్పగలరు?

ఉ. "సుభాషిత రత్నావళి" పద్యంలో కవి, స్నేహాన్ని నీడతో పోల్చాడు కదా! ఇది సరైనదేనా? దీనిమీద మీ అభిప్రాయం తెలపండి.

ఊ. "ధనవంతులు చేసే చిన్న పనికి కూడా గొప్ప ప్రచారం లభిస్తుంది. అదే పేదవాళ్ళ గొప్పపనికి కూడా ఎలాంటి ప్రచారం ఉండదు." అని వేమన ఎన్నో సంవత్సరాల కిందట అన్నాడు కదా! ఈ పరిస్థితే నేడుకూడా ఉందా? ఇలా ఎందుకు ఉంటుంది?

ఎ. మంచివాళ్ళతో స్నేహం చేయడానికి మీరు ఏం చేస్తారు?

ఏ. కిందివాటిలో ఏది సరైనదని భావిస్తున్నారు? ఎందుకో వివరించండి.

  అ. డబ్బు సంపాదిస్తే పొదుపు చేసి, అనుభవించాలి.

  ఆ. డబ్బు సంపాదిస్తే పొదుపు చేసి దానం చేయాలి.

  ఇ. డబ్బు సంపాదిస్తే దానంచేయాలి, అనుభవించాలి.

  ఈ. దానం చేయడంకోసం, అనుభవించడంకోసం డబ్బు సంపాదించక పోవడం మేలు.

## 2. వ్యాసరూప సమాధాన ప్రశ్నలు:

అ. పాఠంలోని పద్యాల ద్వారా నువ్వు గ్రహించిన మంచి విషయాలు ఏవి?


ఆ. పుస్తకాలను పువ్వుల్లాగ చూడాలి. జాగ్రత్తగా చూడాలి అని తెలుసుకున్నారు కదా! పుస్తకాల గొప్పతనం ఏమిటి? వాటిని గురించి ఎందుకు జాగ్రత్తతీసుకోవాలి?

ఇ. మంచివాళ్ళతో స్నేహంచేస్తే కలిగే ప్రయోజనాలు ఏమిటి?

ఈ. "పత్రికలు పదివేలసైన్యంతో, కోటిమంది మిత్రులతో సమానం". అని తెలుసుకున్నారు కదా! దీనిపై మీ అభిప్రాయాన్ని వివరించండి.

© SCERT not to be republished

## IV. పదజాలం



1. **కింది పేరాలోని గీత గీసిన పదాలకు అర్థాలు తెలుసుకోండి. అవే అర్థాలనిచ్చే పదాలతో పేరాను తిరిగి రాయండి.**

ఒక ఊళ్ళో ఒక లోభి ఉండేవాడు. అతను ఎంతో ధనం కూడబెట్టాడు. ఆ సొమ్ము తాననుభవించడు, ఎవరికీ ధర్మం చేయడు. పుత్తడితో నగలు చేయించుకొని వాటిని చూసుకొని విర్రవీగేవాడు. చదువు నేరిస్తే వివేకం కలుగుతుందని ఎంతమంది చెప్పినా అజ్ఞానంవల్ల వినలేదు. తుదకు ఆ సంపాదన దొంగలపాలైంది. సత్యాన్ని గ్రహించాడు. చదువు మొదలుపెట్టాడు. అందరూ హర్షించారు.

2. **కింది పదాలను మీరు మాట్లాడే భాషలోకి మార్చి రాయండి.**

ఉదా : వృక్షంబు – వృక్షము – వృక్షం

అ. వజ్రంబు ఆ. ప్రాణంబు ఇ. సంగంబు ఈ. సాధనంబు ఉ. బంగారంబు

3. **కింది వాక్యాలలో గీత గీసిన పదాలకు సమానార్థకాలు రాయండి.**

ఉదా : సంపదతో గర్వపడగూడదు. ( కలిమి )

అ. సముద్రంమీద ఓడలు ప్రయాణిస్తాయి. (          )

ఆ. వెన్నెలరాత్రి చంద్రుడు ప్రకాశిస్తాడు. (          )

ఇ. భూమిమీద ఎవరూ శాశ్వతంగా ఉండరు. (          )

ఈ. వికలాంగులను నిందించగూడదు. (          )

4. **కింది వాక్యాలలోని గీత గీసిన పదాలను చదివి ఖాళీలలో వాటికి వ్యతిరేక పదాలు రాయండి.**

అ. కలిమిలో గర్వపడకూడదు. .......................... లో కుంగిపోగూడదు.

ఆ. సజ్జనులతో స్నేహం చేయాలి. ......................దూరంగా ఉండాలి.

ఇ. సత్యాన్ని పలకడం అలవరుచుకోవాలి. ......................... అనర్థాలకు దారి తీస్తుంది.

ఈ. కీర్తి రావాలంటే కష్టపడాలి. ............................ మాత్రం అరక్షణంలో వస్తుంది.

ఉ. ఆకలీ దప్పికా నిద్రా దరిద్రుడికీ .............................. కీ ఒకేలా ఉంటాయి.

5. **కింది ప్రకృతి పదాలు చదవండి వాటికి సంబంధించిన వికృతి పదాలు రాయండి.**

అ. పుస్తకం --------------- ఆ. సుఖం ---------------

ఇ. భూమి --------------- ఈ. ధర్మం ---------------

ఉ. శ్రీ --------------- ఊ. గౌరవం ---------------

ఎ. భృంగారం -------------- ఏ. ప్రాణం ---------------


## V. సృజనాత్మకత



1. ఆపదల్లో ధైర్యం, సంపదల్లో ఓర్పు, సభల్లో వాక్చాతుర్యం కావాలి. ఇటువంటి అంశాలను ఆధారంగా చేసుకొని ఒక కవిత రాయండి.
2. పద్యాలను ఆధారంగా చేసుకొని మంచి సూక్తులను, నినాదాలను తయారు చేయండి. వాటిని ప్రదర్శించండి.

© SCERT not to be republished

## VI. ప్రశంస



1. **మీ తరగతిలోని ఇతర భాషల విద్యార్థులను అడిగి మంచి సూక్తులను తెలుసుకోండి.**

2. **కింది పట్టికలోని అంశాలను చదవండి. మీరు చేసేవి, చేయనివి గుర్తించండి.**

అ. ఎవరి దగ్గరయినా పుస్తకం తీసుకొంటే వెంటనే తిరిగి ఇస్తాను.

ఆ. నేను నా తరగతిలో కొద్దిమందితోనే మర్యాదగా ఉంటాను.

ఇ. నేను డబ్బు ఖర్చుపెట్టకుండా దాచుకుంటాను.


ఈ. నేను కేవలం మంచివాళ్ళతో మాత్రమే స్నేహం చేస్తాను.

ఉ. నా పుస్తకాలను నేను జాగ్రత్తగా ఉంచుకొంటాను.

ఊ. అవయవలోపం ఉన్నవాళ్ళకు నేను సహాయంచేస్తాను.

ఎ. నేను బాగా చదువుకొని గొప్ప కవిలా ఎదుగుతాననే నమ్మకం ఉంది.

## VII. ప్రాజెక్టు పని



1. శతక కవులకు సంబంధించిన విషయాలను సేకరించి కింది పట్టికలో రాయండి.

| కవి పేరు | కాలం | శతకం పేరు | ఇతర రచనలు |
|---|---|---|---|
| | | | |

2. పద్యభావాలకు అనుగుణమైన కథలను, సూక్తులను, దినపత్రికల నుండి సేకరించండి. వాటిని చార్టు మీద రాసి ప్రదర్శించండి.

©SCERT not to be republished

## VIII. భాషగురించి తెలుసుకుందాం



**1. కింది మాటలను చూడండి.**

1. ఎండవానలు – ఎండా, వానా
2. తల్లిదండ్రులు – తల్లీ, తండ్రీ
3. రేయింబవళ్ళు – రేయీ, పగలూ
4. గంగాయమునలు – గంగా, యమునా

వీటిని **'ద్వంద్వసమాసాలు'** అంటారు. ద్వంద్వసమాసాల్లో రెండూ నామవాచకాలే ఉంటాయని, ఇవి కలిసినప్పుడు బహువచనరూపం ఏర్పడుతుందని మీరు 6వ తరగతిలో తెలుసుకున్నారు.

**2. కింది విగ్రహవాక్యాలను సమాస పదాలుగా మార్చండి.**

ఉదా॥ రాముడూ, లక్ష్మణుడూ    రామలక్ష్మణులు

అ. కుజనుడూ, సజ్జనుడూ ..............................

ఆ. కూరా, కాయా ..............................

ఇ. అన్నా, తమ్ముడూ ..............................

ఈ. కష్టమూ, సుఖమూ ..............................

ఉ. మంచీ, చెడూ ..............................

**3. కింది సమాస పదాలను ఉదాహరణలో చూపిన విధంగా వివరించండి.**

ఉదా॥ నవరసాలు – నవ (9) సంఖ్యగల రసాలు.

ఊ. రెండు జడలు – ..................................

ఎ. నాలుగు వేదాలు – ..................................

ఏ. దశావతారాలు – ..................................

ఐ. చతుష్షష్టి కళలు – ..................................

ఒ. ఏడు రోజులు – ..................................

పైన పేర్కొన్న సమాసాల్లో మొదటి (పూర్వ) పదంలో 'సంఖ్య' ఉండటాన్ని గమనించారుకదా. ఇలా మొదటి పదంలో సంఖ్యగల సమాసాలను **'ద్విగుసమాసాలు'** అంటారు.

© SCERT not to be republished

4. కింద పేర్కొన్న సమాసాలకు విగ్రహవాక్యాలు రాసి, అవి ఏ సమాసాలో గుర్తించండి. కారణాలు చర్చించండి.

అ. అక్కాచెల్లెళ్ళు ------------------------------

ఆ. పంచపాండవులు ------------------------------

ఇ. ద్వాదశజ్యోతిర్లింగాలు ------------------------------

ఈ. సీతారాములు ------------------------------

ఉ. రాబర్ట్‌రహీమ్‌లు ------------------------------

ఊ. త్రిమూర్తులు ------------------------------

ఎ. నవగ్రహాలు ------------------------------

ఏ. ఏడురంగులు ------------------------------

ఐ. వందపరుగులు ------------------------------

ఒ. సూర్యచంద్రులు ------------------------------



**మీకు తెలుసా !!**

**సాన :**

కొడవళ్ళు, గొడ్డళ్ళు మొదలైనవి పదునుపెట్టుకోడానికి వాడే రాయి. గంధంకోసం గంధంచెక్కను ఒక రాతి మీద అరగదీస్తారు. దాన్ని కూడా "సాన" అనే అంటారు.

© SCERT not to be republished



**నేనివి చేయగలనా?**



| | | |
|---|---|---|
| 1. | పద్యాలను రాగంతో, భావంతో చదవగలను. భావాలను సొంత మాటల్లో చెప్పగలను. | ( ఔను / కాదు ) |
| 2. | పద్యాలను చదివి వాటి భావాలను అర్థంచేసుకోగలను. | ( ఔను / కాదు ) |
| 3. | పద్యంలోని పదాలను సొంత వాక్యాలలో వినియోగించగలను. | ( ఔను / కాదు ) |
| 4. | పద్యాలకు భావాలను రాయగలను. | ( ఔను / కాదు ) |
| 5. | పద్యభావాల ఆధారంగా సూక్తులు, నినాదాలు రాయగలను. | ( ఔను / కాదు ) |

ఉన్నతమైన ఆదర్శం ఉండటం - దాన్ని చేరుకొనడానికి ఓపికగా పరిశ్రమించడం మన జీవిత సూత్రంగా ఉండాలి.
డా॥బి. ఆర్. అంబేద్కర్